# చెట్టూ—మొక్కలూ

ఆ తోట కొన్నాళ్లుగా పాడుబడి ఉన్నా, ఈ మధ్య ప్రజలదృష్టి అటువైపు మళ్ళటంవల్ల – [ఎందుకు మళ్ళిందో సరిగ్గా తెలియదు; కాని అది 'వెనుకబడిన ప్రాంతం' కావటంవల్ల అని కొందరు 'రహదారీ రాజకీయవేత్తలు' ఊహాగానాలు చేస్తూన్నట్టు వినికిడి]–కొంత; కొంతేవిఁటి? చాలా వరకు బాగుపడిందనే చెప్పవచ్చు.

ఆ తోటలో, ముసలిచెట్లూ, సరికొత్త మొక్కలూ, ఉంటంవల్ల అనేకులు అనేక విధాలుగా అంటారు. ఏది ఎల్లా ఉన్నా, ఆ ఎత్తయిన చెట్లూ, పొట్టిగా ఉన్న మొక్కలూ, రెండురకాల వయోవృత్తుల్ని సూచిస్తున్నట్టుగా చూట్టానికి అదోమాదిరి అందంగానే ఉన్నాయి మరి.

వర్షాకాలపు రోజులేమో, ఒక రోజు కొన్ని అందమైన చిన్న వర్షం కురిసింది. తోటంతా చల్లబడింది. మొక్కల సంతోషానికి హద్దూపద్దూ అంటూ ఏమీ లేకుండా, గట్లు తెగినట్లయిపోయింది ఓ మొక్క తనలోనే చిరునవ్వు – చిరునవ్వా అంటానికి వీల్లేదు దాన్ని – ఏదో గమ్మత్తయిన, అతిశయాన్ని సూచించే నవ్వు – నవ్వుకొంటూ:– 'ఈ వర్షం ఇల్లాగే ఉంటే ఎంతహాయిగా ఉంటుంది!' అని, చిన్నగా ఏం ఖర్మ?– పెద్దగానే అనేసింది.

ఆ పక్కనే అంతలా పెరిగిన చెట్టూ నవ్వింది. కాని మొక్క నవ్వుకీ, దీనికీ ఎక్కడా సాపత్యంలేదు తెలివి తక్కువదనాన్ని చూచి నవ్వినట్టుందీ చెట్టునవ్వు 'ఒరే అబ్బాయ్! నువ్వెందుకింతగా ఆనందిస్తున్నావో, నాకైతే అర్థం కావటంలేగు. కాని ఓ అరపూట పెద్దవాన కురిస్తే, ఏమవుతావో తెలుసా?' అంది

మొక్క కొంచెం అదిరిపడ్డట్టయి, చుట్టూ ఉన్న తన సావాసగాళ్లను చూచి ంది ధైర్యం తెచ్చుకుని చెట్టును చూస్తూ నిర్లక్ష్యంగా అంది —"ఏమవుతుంది? ఏ-మీ-కాదు."

చెట్టు కొంచెం గలగల్లాడింది –"ఏం కాదంటావేఁవిటి? చెబుతూంటే అర్థం కాదూ? తేలిగ్గా తల్లక్రింగులవుతావ్"

"ఏమీ కామంటూంటే. నువ్వు చెప్పేవన్నీ పాతమాటలు. చూస్తు, ఈ వర్షం ఎంత ఆనందకరంగా ఉందో! నువ్వు ముసలిదానివాయెమరి. కొంచెం పెద్దగా గాలివస్తే, 'పళ్లూ, ఆకులూ ఎక్కడరాలి పోతాయో!' అని నీ భయం. ఆ భయంతో ఈ ఆనందం అనుభవించలేక పోతున్నావ్. ఇలా భయంతో ఎంతకాలమని? బతికిన కొంచెం సేపయినా ఈ ఆనందాన్ననుభవించు!" మొక్క ఒక బోద్దలా మొగం పెట్టింది.

"అవును బాబూ! నేను ముసలినే. అయితేనేం? నా జీవితం ఏలాగో ఓలాగు గడించింది. కాని, నీ జీవితం ఇంకా ఎంతో ఉంది. పాపం శాంతించుగాక! పిడుగులూ, అవ్వీ పడకుండా మీ రందరూ వెయ్యేళ్ళు బతుకాలనే నా ఆశ" చెట్టుకంఠం గద్గదమయింది.

"చాలు చాలు, ఈ ఆనంద సమయంలో నీ విచారం చూడలేం."

"మారన"

"నాకు తెలుసు, నువ్విలా అంటావని. నీ వయస్సులో అల్లాగే అనిపిస్తుంది. కాని, అనుభవాలతో పండిన మా వంటివాళ్లున్నంతవరకే మీ మాటలన్నీ, మీ రూ నాల్లు "ధక్కా మొక్కీలు" తిన్నప్పుడు కాని మా మాటలు గుర్తురావు.!

మొక్కకు కొంచెం రోషం వచ్చిందిలా ఉంది –"నీ ముసలిమాట లాపెయ్. మీకూ మాకూ సాపత్యం ఏఁవిటి? కాకపోతే మేఁవే చాలా అభ్యుదయంలో ఉన్నాం. చూడు, మా ఆకు లెంత నవనవ లాడుతున్నాయో!" మొక్క గర్వంగా తలెగరేసింది.

నీ మాటలు వింటుంటే నాకో నాటి సంఘటన గుర్తొస్తోంది" చెట్టు తన పూర్వ జీవితంలోకి చూస్తూ అంది. "ఓసారి వసంతం తోటంతా వ్యాపించింది. అప్పుడు నీలాంటి మొక్కలు కొన్ని తమలోతాము—సరిగ్గా నువ్విప్పుడున్నట్టే — నా ఆకులు నవనవలాడుతున్నాయంటే, నావని తెగపోట్లాడుకున్నాయి. కాని కొన్నిరోజులు గడిచి, ఋతువు మారి, ఆకులన్నీ పండిపోయినప్పుడు — పోట్లాటలేదు. నే నెక్కువ పండినానంటే నేనని అనలేదు. దిక్కుమొగాలేసి చూసుకొన్నాయ్ ... ఎవరైనా ఏంచేస్తారులే...ఋతువే అల్లా అనిపిస్తుంది"

అప్పటికి మొహాలు ముడుచుకున్నా, వెంటనే ముసలిచెట్లను పరిహాసంచేస్తున్నట్టు కిలారుమన్నయ్, మొక్కలు.

* * *

సుమిత్ర, ఆవిడ తాతగారు, రావుబహద్దరు భుజంగరావుగారు మెల్లిగా వచ్చి చెట్టు క్రింద, మొక్కదగ్గరగా కూర్చున్నారు. ఇద్దరి మొహాలూ, ఏదో వాదించుకొన్నట్టుగా తీవ్రంగానే ఉన్నయ్ కొంచెంసేపు ఇద్దరూ, నేలమీద వ్రేలితో గీట్లుగీస్తూ, చిన్నగడికపోచల్ని తుంచుతూ మౌనంగానే ఉన్నారు. ఎంతసేపలా ఉండాలో ఇద్దరికీ అర్థంకాలేదు. చివరకి రావుబహద్దరుగారే నేలమీద గట్టిగా గీస్తూ ఇలా అన్నారు: "అయితే అమ్మాయ్! నీమనసులోమాట, చివరిమాట చెప్పేసెయ్. ఆలస్యం దుర్భరంగాఉంది!"

సుమిత్ర తాతగారి తీవ్రమైన మొగం మీదికివాలే తెల్లని ముంగురుల్ని, నల్లని విచారరేఖల్ని చూస్తూ ... చూస్తూ, ఏదో అంటానికే పెదవులు కదిలించింది. కాని బహద్దరుగారు మళ్ళీ అందుకున్నారు: "చూడమ్మాయ్! నేనేం చెప్పినా నీమంచికోసమే అని గుర్తెట్టుకో. నా ఖర్మ, మీ నాన్న — నేను బతికుండగానే తాను పోతూపోతూ నిన్నప్పచెప్పాడు. ఇక ఎవరైనా నీవే అనుకొంటూ బతుకుతున్నాను. నిన్నో మంచి ఇంటిదాన్ని చేసి, సుఖపెట్టే


మానెక్‌లాల్ & సన్సు

బొంబాయి,

వారి వర్కుషాపు యంత్రములు ..

లేతు మెషిన్లు—డ్రిల్లింగు, మిల్లింగు, ప్లేనింగు, గ్రైండింగు, పోలిషింగు, కటింగు, సీమింగు యంత్రములు...

కుటీర పరిశ్రమలకు, దారు (కర్ర) లోహపరిశ్రమలకు యంత్రములు

వివరములకు – ఆంధ్ర ఏజెంట్లు :

తాతా - ప్రభాత

విజయవాడ. 2.

బాధ్యత నాపైనేఉంది." ఆయన కంఠం కొంచెం గంభీరమయింది. "మనం పెద్ద వాళ్లం; గొప్ప గౌరవప్రతిష్ఠలు కలవాళ్లం. మన ఉన్నతవంశం, మన ఆచార వ్యవహారాలూ, అన్నీ దృష్టిలో ఉంచుకుని..."

"అయితే అవన్నీ మంటకలుపుతున్నా నంటారా?" సుమిత్ర రుసరుసలాడింది.

"..కాకపోతే ఏమిటమ్మా! వాడెవడో...కులం, గోత్రం, మర్యాదా తెలియనివాణ్ణి, ఊరూ పేరూ లేనివాణ్ణి—కాలేజీలో నవ్వుతూ మాట్లాడినంతలో, ఆ ప్రకాశంగాణ్ణి, పెళ్లాడతానంటావా?" బహద్దరుగారు కొంచెం తమాయించుకొన్నాడు... "కాదమ్మా! నేచెప్పేది విను. ఆ సుబ్బారావున్నాడు చూడు, మన స్థితిగతులకూ, హోదాకూ, ధాయాకూ, తగినవాడు. అతని నాన్న మనక నేకరకొలుగా అవసరపడేవాడు, కాబట్టి నామాటవిని అతన్ని..."

"ఛస్తే చేసుకోను" సుమిత్ర తెగేసి చెప్పింది. చేతిలో గరికపోచనుంచి విసిరివేస్తూ మళ్ళీ అంది: "మీ ముసలి మాటలూ, నిరర్థకాలైన ఆచారాలూ, వల్లమాలిన సంప్రదాయాలూ, నా నిశ్చయానికేవిధంగా అడ్డం రాలేవు. అతడెవడైతే నేం? ఎల్లాంటివాడైతే నేం? ప్రేమించినచోట ఇవేవీ అడ్డునిలవ్వు. ఇది నా నిశ్చయం."

బహద్దరు ఏదో అనబోయారు. పెదవులు కదలినయ్ కాని.....సుమిత్ర పదిగజాల దూరంలో వెళ్తూ కనిపించింది.

* * *

చెట్టుకు అటుప్రక్క కొంచెందూరంలో, ఒక సిమెంటు బెంచిమీద మిల్ మేనేజర్ రాజారావ్, సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు. ఆయన, తనమిల్లు (నిజానికి తన మిల్లు కాదనుకోండి) పనివాళ్లలో నాయకుడైన నరసింహంకోసం ఎదురుచూస్తున్నాడు. నరసింహం రానేవచ్చాడు. కాని రాజారావ్ అతన్ని కూర్చోమనలేదు. అతడల్లాగే నిలబడ్డాడు.


"నరసింహం!" పూర్తయిన సిగరెట్ కి మరోటి అంటిస్తూ అన్నాడు.

"చూడు నరసింహం! ఈ విషయంలో నీ కేవిధంగానూ సాయంచేయ లేను. నీవ నేదో నువ్వు చూసుకో, ఒకళ్ళతో లి నీ కనవసరం. చూడు, ఇది నాసలహాగా పాటించు."

నరసింహం వినయం చూపిస్తూనే అన్నాడు: "మీసలహాకు నా ధన్యవాదాలు. కాని పాటించలేక పోతున్నందుకు విచారిస్తున్నాను. అయితే ఒకప్రార్థన—మీరు మమ్మల్ని కనికరించాలి. మిల్ యజమాని మీమాట కాదనలేడనేది మీకూ, మాకూ తెలుసు. ఏదోరకంగా మాకు బోనస్ వచ్చే ఏర్పాటు చేయించండి. చాలా కృతజ్ఞులమవుతాం."

"హుం. నరసింహం! నీనుండి నేనెంతో ఆశించాను. ఎన్నో ఊహించాను. కాని... దాన్నంతా నేలపాలు చేశావ్"...సిగరెట్ నుసిదులుపుతూ మళ్ళీ అన్నాడు, "చూడు నరసింహం! ఇల్లాంటి అల్లర్లు వచ్చినప్పుడు, నువ్వేదో నావాడుగా, తోడుగా ఉంటావనుకుని ఉద్యోగం ఇప్పించాను. ఏదో చదివినవాడివి, తెలివైనవాడివి, పైగా నావాడివి అనుకొంటే, ఇంటివాడు దొంగల్లో కలిసినట్టు చేస్తావా?...అయిందేదో అయిపోయింది. ఇప్పటికీ మించిందిలేదు. నీ భావిజీవితాన్ని సుఖమయం చేసుకో. ప్రమోషనిప్పిస్తా. ఇంకా—"

"క్షమించండి సార్! నావల్ల కాదది"



# ★ చెట్లూ - మొక్కలూ ★

మేనేజర్‌కు కఠినంగా వినిపించింది. మొగంలో కొంచెం కోపమూ ఒలికింది. "అయితే తిన్నయింటి వాసాలెక్క పెడతా వంటావ్.. అంతేగా.. " అన్నాడు.

"దీన్లో తిన్న ఇంటి వాసాలెక్క పెట్టడ మేమిటో నాకర్థం కావటంలేదు. మా కష్టాలు చెప్పుకుని - అధికారంలో ఉన్నారు కాబట్టి న్యాయం చేయమంటున్నాం. ప్రార్థిస్తున్నాం."

"హుఁ. న్యాయం ఏమిటోయ్ న్యాయం! ఇన్నేళ్లబట్టీ వచ్చే న్యాయం ఇవాళ కొత్త కాయిందా? ఏమిటో విధ్వేషాలు తీయటం కాకపోతే "

"నిజంగా మీలో దయలేదా సార్! మీరింత కఠినంగా ఎల్లా ఉండగలుగుతున్నారో నాకర్థం కావటంలేదు "

"దయేమిటోయ్ దయ! అది ఉంటే నాకీనాడో మేడ, ఓ కారూ, ఓ 'బ్యాంక్ అక్కౌంట్' అంటూ ఉండేవా? నిజంగా చాలాగా నువ్వూ ఉంటే నిన్నూ నాలా చేస్తాను. నా మాట విను" బుగుగరించి నట్టన్నాడు మేనేజర్.

నరసింహం ఇక సహించలేకపోయాడు. "ఇదంతా అనవసరం." మండిపోతూ అన్నాడు: "మీరెల్లా బోనస్ ఇవ్వరో మేముచూస్తాం. మేం కొత్త మొక్కలం సార్ కొత్త మొక్కలం. మేమేమయినా చేయగలం. సమ్మెచేస్తాం, పికెటింగ్ చేస్తాం బోనస్ ఎలా ఇవ్వరో చూస్తాం "

మేనేజర్ తానువిడిచే పొగలోంచి నరసింహం గేటుదాటటం చూచి, గట్టిగా నవ్వుకపిల్చి, సిగరెట్ దూరంగా విసరి, లేచాడు.

*   *   *

అపక్కనే పచ్చికలో ఆరేళ్ళ సర్వీసుగల ఓ ఉపాధ్యాయుడు కూర్చుని ఏదో పుస్తకం చదవటానికి పూనుకున్నాడు కాని అదెల్లా సాగుతుంది? తలలో లక్ష ఆలోచనలు.

"ఏమిటీ విద్యవ్యాద్యోగం .. డబ్బులేని వాళ్ళు చదివినా లాభం లేనట్టుంది డబ్బు లేక పెద్దచదువులు చదవలేకపోవటం నేరమా? . చదివిన ఈ కొంచెం చదువైనా స్వతంత్రంగా బతకటం నేర్పదు. బడి పంతులో, క్లర్కో కావటంతప్ప మరేమీ చాతకాదు. ఛీ గడియారాల బతుకులు... మా వెధవ బతుకులు...

అదీగాక.. పని చేసున్నా.. నాలుగైదు నెల్ల జీతాలూ రాకపోతే, వందలుతింటున్న ఆఫీసర్లం చేస్తున్నట్టు?..! ఒక్కనాడు లేటుగావస్తే వీడితాడు తెంచుతారే? ఛీ... న్యాయంగా రావాల్సిన దానికూడా బిచ్చగాడికిమల్లే దేబిరించటంవా? పుణ్యాని కిచ్చిన టియ్యాటంవా? దానికి సిఫారసులు కూడానా?. వెధవది, ఇంక్రిమెంటు పాస్ చెయ్యడానికూడా నెలలూ సంవత్స రాలూనా? కుర్చీలకు అగస్త్య దాహాలూ, దర్వాజాలకు బకాసుర క్షుధలూన్నూ. ఆఫీసు మొగం చూస్తేనే అమావాస్య గుర్తొస్తుంది.

.. "జీతం ఎక్కించు బాబూ!" అన గూడదు. అంటే.

"నువ్వు తప్పుకో-మరోడొస్తా"డనిసమాధానమా? . అయినవాళ్ళకు నెలలోనే రెండేసి ప్రమోషన్లూ, కాని వారికి కలకాలం ఆకలే...ఈ తక్కువ జీతంలో నూక్కలుకి శుభ్రంగా రావాలి. లేకపోతే ఇనస్పెక్టర్ కలంలోని ఎర్రసిరా పర్సనల్ ఫైలుమీద కక్కుతుంది. ఛీ. ఛీ.. ఎవరి నేంచేసినా పాపంలేదు.. ..."

కాఫీ తాగుదామని జేబుతడుముకున్నాడు. కిరాణాకొట్టువాడిచ్చిన బిల్లు తప్ప మరేమీలేదు. నెలాఖరాయె మరి (జీతాలు రావటం పదిహేనుకి. అయిపోవటం పద్దెనిమిదికి) నిజాని కతడింకోప్పుడైతే విచారించే వాడుకాడు. ప్రస్తుతం ఊహల్లో...అతడు మరీ రెచ్చిపోయినాడు.

'...టీచర్‌కు అప్పుచేయని రోజుండకూడదు కాబోలు. ఉంటే గర్వంవస్తుందనా?.. ఆ ఉన్నాడనుకోబడే దేవుడూ ఇల్లానే అనుకోంటున్నాడా? .ఈ సందర్భంలో. గొప్పఆశలు విడిచినా, సామాన్య వాంఛలూ తీరని ఈ సమయంలో.. ... ఎవడుమాత్రం డబ్బుకోసం ఎందుకు తప్పుదారి తొక్కడు? ... ఎందుకు తొక్క కూడదు . ?'

మూక ఉమ్మడిగా ట్యూషన్లు చెప్పుకోనే కొందర్ని-బహు కుటుంబీకులైనా-తానిదివరకసహ్యించుకోవటం అన్యాయమని ఇప్పుడనిపిస్తోంది. అయితే హెచ్. ఎమ్ కి వాళ్లు కొంచెం కంటగింపయితే.. వెంటనే . పైకి రిపోర్టులు...

అతనింకుమించు అల్లానే ఆలోచిస్తున్నాడు. స్కూలుకు రోజూ వెళ్తున్నాడు. గడియారం ఖచ్చితంగానే నడుస్తోంది. ప్యూన్ సరిగ్గానే గంటలు కొడుతున్నాడు. రోడ్లమీద కార్లూ జనం యథాప్రకారంగానే నడుస్తున్నారు. కాని.. 'యథాప్రకారంగా' 'రానివీ' 'లేనివీ' వాళ్ళజీతాలే... జీవితాలే...

*   *   *

సగంకట్టిన 'ఫౌంటైన్' గట్టుమీద కూర్చుని, అప్పుడే వెలిగిన లైటువెలుగులో ఒక గుమాస్తా, కాడవిరిగిన కళ్లద్దాలజోడును అతి జాగ్రత్తగా తగిలించుకొని 'సెకండ్ హాండ్ పేపర్' చదవటం ప్రారంభించాడు.

'తృతీయ ప్రపంచయుద్ధం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. లోపల్లోపల్నే మహా ప్రయత్నాలు బ్రహ్మాండంగా సాగుతున్నయ్. అగ్రరాజ్యాలు దీన్ని అరికట్టటానికి బదులు దోహదం చేస్తూండటం మ




జియోఫ్రీ మేనర్స్ అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, రిజిష్టర్డ్ వాడుకందారు.

# ★ చెట్లూ - మొక్కలూ ★

శోచనీయం. క్రొత్త క్రొత్త మారణాయుధాలు కనుగొనబడుతున్నయ్. వాటి పరీక్షలూ ఘనంగా జరుగుతున్నయ్. శాంతి కాముకులమని బహిరంగంగా రొమ్ములు విరుచుకు తిరిగే దేశాలే ఈ పనులుచేయటం మరీ ఘోరం. మన ప్రక్కదేశాలే యుద్ధానికి స్థానాలుకావటం మరీ ప్రమాదవిషయం...'

తలగోక్కొని ఆ గుమాస్తా మళ్ళీ ప్రారంభించాడు.

'ఈసారి ప్రపంచయుద్ధంవస్తే మానవత్వం సమూలంగా నాశనం అవుతుందనేది నిర్వివాదం. దీన్ని ఎల్లాగైనా ఆపవలసినబాధ్యత ప్రతి దేశంమీదనేగాక, ప్రతి వ్యక్తిమీదా ఉన్నట్టు భావించటం అత్యవసరం. లేకపోతే, పూజింపదగిన, గర్వింపదగిన, అభిమానింపదగిన అందరి మాతృదేశాలూ నాశం అవటం తథ్యం. ప్రతి మానవుడూ సోదర మానవునితో కలిసి నిజంగా ఈ యుద్ధ నిరోధక యత్నంచేస్తే- ఏ కొద్దో, బలవంతులైనా స్వార్థులైన అగ్రరాజ్యాలవారు ఏవిధంగానూ అడ్డు నిలువలేరు. యుద్ధానికి ముందంజవేసే రాజ్యంలోనే ఈ నిరోధకోద్యమం ప్రథమంగా జన్మించటం తక్షణం కావలిసింది...'

చదువుతూన్న పేపరుతోటే కొంచెంగా విసరుకొని, అర్థాలను సరిచేసికొంటూ ఆ గుమాస్తా మళ్ళీ ప్రారంభించాడు

'... మనం మరణానికి భయపట్టంలేదు నిజానికెవరూ భయపడకూడదుకూడా. కాని మనం దేనికోసం మరణించాలనేదే ముఖ్యమయిన ప్రశ్న. యుద్ధంకోరకాదు, వినాశం కోరకాదు, మనం మరణించవలసింది. శాంతికొరకు...మానవత్వం స్థిరంగా ఉండటంకొరకు ... రాబోయే తరాలు సుఖంగా ఉండేందుకొరకు.. '

ఆ గుమాస్తా రోజూ పేపరు చదువుతూనే ఉన్నాడు. పత్రికలు అల్లాంటి విషయాలు వ్రాస్తూనే ఉన్నాయి. విమానాలెగురుతూనే ఉన్నాయి. సినీమాల్లో, 'న్యూస్ రీల్లు' చూపుతూనే ఉన్నారు. సుహృద్భావ సంఘాలు పర్యటిస్తూనే ఉన్నాయి భూమి తిరుగుతూనే ఉందిమరి.

* * *

"ఈ మొక్కలు పిచ్చివి. తమ మంచి చెడ్డలు తమకు తెలియవుగదా, పైగా చెప్పినా తెలుసుకోలేవు. అంతేకాకుండా తమ పిచ్చి పిచ్చి ఆశలతో, కోరికలతో-చూడబోతే-మమ్మల్ని కూడా నాశనం చేసేట్టున్నయ్" అని చెట్లు విచారపడ్డయ్.

"సుమిత్ర మూర్ఖప్పట్టు పడుతోంది. మంచిచెప్పినా ఏమాత్రమూ అర్థంచేసుకోలేదు. తరాలుగా వచ్చే ఆచార, సంప్రదాయాల్ని నాశంచేసి, ఆ 'కోన్కిస్తా' గాణ్ణి పెళ్ళాడుతుందట.. హు...కుటుంబ గౌరవాన్నీ, వంశప్రతిష్ఠనీ, చివరకు నా పేరునూ బూడిద పాలు చేసేట్టుంది." రావు బహద్దరు గారిలో విచార కోపాలు తాండవించినయ్.

"ఏడిసు . వీడి బతుక్కి వీడు . . నన్నే బెదిరిస్తాడా? లక్షమందిని చూచాను. వెధవ ఏమాత్రం ఇంగితజ్ఞానం ఉన్నా ఇల్లా అనడు. ఛండాలపు వేషాలూ వీడూన్నూ...వీడి అంతేమిటో నేనూ చూస్తాను. సమ్మె చేస్తాట...సమ్మె - హు, మేనేజర్ లో కోపంగట్టు తెంచుకొంది.

బ్రతకటం చేతకాని ప్రతి అణాకానీ వాడూ, బ్రతికే ఆఫీసర్ని, పాలిం ప్రభుత్వాన్నీ అనడమే. చాతయిచేతేమామాదిరి కారాదా?

ఊహు! అది చేతకాదు. అటువంటప్పుడేడుస్తూ మూలన కూర్చోవాలి. వాగడమెందుకు? పైనుంచే పెద్ద తలలు సీత్కారం చేశాయ్.

"కొంచెపు మనుషులూ, కొంచెపు మాటలూన్నూ, వీళ్ళే ప్రపంచాన్నంతా కిచాటు చేస్తున్నారు. యుద్ధమూ, దానివెంట శాంతీ, తరాలనుండి వచ్చే వరుస. వాటి నీరోజు వీళ్ళాపుతారట...హుఁ..." పురాతన రాజ్యనీతి ముక్కూ మూతీ విరిచింది.

* * *

"ఇంకా ఈ పాతచెట్లు ముసలిమాటలు వదలిపెట్టవు. ఈ ఋతు వెంత ఆనందమైంది! ఆనందించటంచేతకాక — పైగా మనల్ని విచారించమంటున్నయ్. హుఁ. నిజానికి చెట్లే తోటకు దిష్టి బొమ్మల్లా ఉన్నయ్." మొక్కలు చెట్లను వెక్కిరించినయ్.

"తాతయ్య ఎప్పుడూ ఇల్లాగే అంటూంటాడు. ఇంకా ఎన్నాళ్ళని ఈ ముష్టి ఆచార సంప్రదాయ బంధాల్లో పడిఉంటం? ఛీ... ఛీ...వీటన్నిటినీ ఒక్కసారిగా తెంపేస్తాను. ప్రేమించిన ప్రకాశాన్నే పెళ్ళాడతాను... ఎవరడ్డొస్తారో చూస్తాను," సుమిత్ర దృఢంగా నిశ్చయించింది.

"ఈ మేనేజర్ గాడెవడంటా మాకడ్డు పడటానికి. వెధవని ముక్కూ మొగం పగలకొడితేసరి, దారికొస్తాడు.. అంతదూరం ఎందుగ్గాని, వారం రోజుల సమ్మెకు వాడూ, వాడి ఓనరూ ఏమిటి?...వాళ్ళతల్లో జేజమ్మ కూడా కాళ్ళబేరానికి రావలసిందే ..." నరసింహం ఉద్రిక్తుడైనాడు.

"పనిలేకుండా గుప్పిళ్ళకొద్దీ ఇళ్ళల్లో పడుతుంటే వాళ్ళల్లాగే అంటుంటారు .. వాళ్ళదీ ఒక బ్రతుకే? ..నలుర్ని ఏడ్పించే బ్రతుకు.. కొద్ది రోజుల్లోనే వీళ్ళబండారం బైట పెట్టిస్తాం" క్రింది చిన్న తలలు ఉరిమినయ్.

"ఈ పూర్వపు మాటలు మేం ఒప్పుకునేది లేదు. వాటన్నిట్నీ నాశంచేస్తాం. మాకు శాంతి కావాలి ... వాళ్ళూ శాంతినే కోరవచ్చు. కాని దుష్టపద్ధతిలో కోరటం జరిగింది. మా పద్ధతి సర్వసమ్మతం ... ఈ దారిలోనే శాంతి తెస్తాం" అధునాతన రాజనీతి ఉద్ఘోషించింది.

* * *

తోటలో—క్రింది భూమి నిశ్వసించింది, పై ఆకాశం కన్నీరు విడిచింది. రెండూ చూపులు కలుపుకున్నయ్. ఆ చూపులు "రైలు పట్టాల్లాగున్న వీళ్లు ఏనాటికైనా కలిసి, సమాధానపడి లోకం బాగుపడేట్టు చేయలేరా?" అన్నట్టుగా ఉన్నాయి. ★

ఫండిత డి.గోపాలాచార్యులవారి
అరుణ
గర్భాశయ రోగనివారిణి
ఆయుర్వేదాశ్రమం,
(ప్రైవేటు) లిమిటెడ్., మద్రాసు-17.